క్లుప్తంగా

కరోనా లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోండి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 21 మందికి కోవిడ్ పరీక్షలు చేశారు. అందులో అందరికి నెగిటివ్ రిపోర్టులు వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు. వైరల్ ఫీవర్ల వ్యాప్తి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తీవ్ర జ్వరం, దగ్గు, గొంతు నొప్పి లక్షణాలతో బాధ పడుతున్న వారు వెంటనే కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

సంజయ్‌పురి కాలనీ నూతన కమిటీ

జగద్గిరిగుట్ట: నవోదయ వెల్ఫేర్ అసోసియేషన్ సంజయ్‌పురి కాలనీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్‌రావు, జనరల్ సెక్రటరీగా కృష్ణ, ట్రెజరర్లుగా శ్రీనివాస్‌గౌడ్, రాము, అడ్వైజర్లుగా దామోదర్, వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్‌లుగా రంగు సిద్దుగౌడ్, షౌకత్ పాషా, జాయింట్ సెక్రటరీగా మల్లికార్జున్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రదీప్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. కాలనీ సమస్యలపై ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేస్తూ.. వీలైనంత తొందరగా పరిష్కారానికి కృషి చేస్తానని ఎన్నికైన సభ్యులు తెలియజేశారు.

అన్నదానం



కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్ సమీపంలో ఉన్న శ్రీకట్ట మైసమ్మ ఆలయం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించి అన్నదానంలో పాల్గొన్నారు. ధర్మారెడ్డి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం పూజలు చేసిన తర్వాత ఆలయ కమిటీ ప్రతినిధులు వివేక్‌రెడ్డి, శైలజ దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రశాంతంగా టీఎస్-సెట్

ఉస్మానియాయూనివర్సిటీ: అధ్యాపక ఉద్యోగాల అర్హత పరీక్ష టీఎస్‌సెట్-2022 తొలిరోజు ప్రశాంతంగా ముగిసిందని అధికారులు తెలిపారు. మంగళవారం టీఎస్‌సెట్ కార్యాలయంలో వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ సెట్ ప్రశ్న పత్రాలకు సంబంధించిన కోడ్‌ను విడుదల చేశారు. తొలిరోజు రాష్ట్ర వ్యాప్తంగా 30 కేంద్రాలలో రెండు విడతలుగా జరిగిన సెట్‌కు ఉదయం 80.2 శాతం, మధ్యాహ్నం 83 శాతం అభ్యర్థులు హాజరైనట్లు ప్రొ.మురళీకృష్ణ పేర్కొన్నారు.

సమయానికి చేరుకున్నా అనుమతించ లేదు..

అధ్యాపకుల అర్హత పరీక్ష టీఎస్‌సెట్-2022 తొలిరోజు గందరగోళం నడుమ ప్రారంభమైంది. కార్యదర్శి ప్రొ.మురళీకృష్ణ పరీక్ష నియమ నిబంధనల గురించి పూర్తి సమాచారాన్ని అభ్యర్థులకు చేరవేయకపోవడంతో వందలాది మంది సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోలేకపోయారు. నాచారం, మల్లాపూర్ సెంటర్లలో అనేక మంది అభ్యర్థులను అధికారుల అనుమతించలేదు.

యువకుడి మృతి

ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన

కుత్బుల్లాపూర్: ప్రేమ వ్యవహారంలో మనస్తాపం చెందిన ఓ యువకుడు బిల్డింగ్ పైనుండి దూకడంతో తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. అయితే ఆస్పత్రి డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే చనిపోయాడని యువకుడి తరపువారు ఆందోళనకు దిగడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి... షాపూర్‌నగర్ ప్రాంతానికి చెందిన జగన్ కుమార్ కుమారుడు మణికళ్యాణ్ (19) స్థానికంగా ఉండే ఓ అమ్మాయితో ప్రేమ వ్యవహారం నడుపుతూ వచ్చాడు.. ఇంతలో ఏమైందో ఏమో.. సోమవారం మధ్యాహ్నం బిల్డింగ్ పై నుండి దూకడంతో తీవ్ర గాయాలై ఉండగా బంధువులు గుర్తించి పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సృజన ఆస్పత్రికి తీసుకువచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందడంతో బంధువులు డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే చనిపోయాడంటూ..గొడవకు దిగి ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పెట్ బషీరాబాద్ సీఐ ప్రశాంత్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, మల్లేష్ సిబ్బందితో వచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన చోటు చేసుకోగా.. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

అధికారుల నిర్లక్ష్యం..

కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం

అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం.. వెరసి పురాతన పైప్‌లైన్ పగిలిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వెన్నెలగడ్డ ఎన్నా చెరువు నుంచి గోదావరి హోమ్స్ పక్కనే ఉన్న ఫాక్ సాగర్ నాలా వరకు గతంలో పైప్ లైన్ వ్యవస్థ ఉంది. ఇక్కడ కొన్ని రోజులుగా జరుగుతున్న కొత్త నాలా నిర్మాణ పనులతో ఇప్పటికే స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా పాత పైప్‌లైన్ పగలడంతో నడవడానికి వీలు లేకుండా రోడ్డుపై మురుగు పారుతోంది. ఇటు గ్రేటర్ అధికారులు.. అటు ఇరిగేషన్ అధికారులు చూసి వెళ్లారే తప్ప సమస్యను పరిష్కరించే నాథుడే కరువయ్యాడు. గోదావరి హోమ్స్ పరిసర ప్రాంతాల్లో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. – కుత్బుల్లాపూర్



గోదావరి హోమ్స్‌లో కొనసాగుతున్న నాలా నిర్మాణ పనులు



గోదావరి హోమ్స్‌లో రోడ్డుపై పారుతున్న మురుగు



ధ్వంసమైన పాత డ్రైనేజీ పైపులైన్

శుభకార్యాలకు పోలీసుల నుంచి అనుమతి తప్పనిసరి

- ఫంక్షన్‌హాళ్ల నిర్వాహకుల సమావేశంలో ఏసీపీ రామలింగరాజు
- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశం



ఫంక్షన్‌హాళ్ల యాజమాన్యాలకు సూచనలు ఇస్తున్న పేట్‌బషీరాబాద్ ఏసీపీ రామలింగరాజు

కుత్బుల్లాపూర్: ఫంక్షన్‌హాళ్లలో జరిగే శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలతో చుట్టు పక్కల వారికి ఇబ్బందులు తలెత్తకుండా యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకోవాలని పేట్‌బషీరాబాద్ ఏసీపీ రామలింగరాజు అన్నారు. మంగళవారం పేట్‌బషీరాబాద్‌లోని ఏసీపీ కార్యాలయంలో ఫంక్షన్‌హాళ్ల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఫంక్షన్‌హాళ్ల ప్రాంగణంలో పోలీసుల అనుమతి లేనిదే డ్రోన్ కెమెరాలను వినియోగించరాదన్నారు. అదే విధంగా శుభకార్యాల్లో సౌండ్ సిస్టమ్‌లను అనుమతి తీసుకున్న సమయానికి లోబడి ఉండాలన్నారు.

మద్యం అనుమతించొద్దు...

ఫంక్షన్లలో మద్యాన్ని అనుమతించొద్దని సూచించారు. అదే విధంగా జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు చోటు ఇవ్వదన్నారు. ప్రతి ఫంక్షన్, ఈవెంట్‌కు పోలీసుల నుంచి అనుమతి తప్పనిసరిగా పొందాల్సి ఉంటుందని సూచించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా ప్రైవేట్ సెక్యూరిటీని వినియోగించాలన్నారు. అదే విధంగా ఫంక్షన్ హాలు ప్రాంగణం, చుట్టూ సర్వేలెన్స్ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యాజమాన్యాలు నిబంధనలను పాటించడంలో విఫలమైతే కఠిన చర్యలు తప్పని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐలు ప్రశాంత్, సుధీర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని నిజాంపేట్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు.

◆ నిజాంపేట్ ఫీడర్ పరిధిలోని నిజాంపేట్ ప్రధాన రోడ్డు, హెరిటేజ్ లేన్, పాలంపల్లి విల్లాస్ ప్రాంతాల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.

◆ 11 కేవీ శ్రీనివాస కాలనీ ఫీడర్ పరిధిలోని శ్రీనివాస హౌసింగ్ సొసైటీ, బాలాజీ మిడోస్, కేటీఆర్ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

◆ 11 కేవీ ఎలీప్ ఓహెచ్ ఫీడర్, 11 కేవీ ఎలీప్ కేబుల్ ఫీడర్ల పరిధిలోని ఎలీప్ ఇండస్ట్రియల్ ఏరియాలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ప్రగతినగర్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

జీడిమెట్ల: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. బుధవారం ఉదయం 9.30గంటలకు గాజులరామారంలోని ఎన్టీఆర్‌నగర్ ఎంఎస్ ఫంక్షన్ హాలులో నిర్వహించే ఉచిత మెడికల్ క్యాంపును డివిజన్ ప్రజలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. మెడికల్ క్యాంపులో ప్రజలు అన్ని రకాల మెడికల్ టెస్టులను వినియోగించుకోవాలని కోరారు. వివరాల కోసం ఎస్‌పీఆర్ ట్రస్ట్ మెంబర్ దండే రాజుని సంప్రదించాలని కోరారు.

సందల్ పోస్టర్ ఆవిష్కరణ

దుండిగల్: గాజులరామారం డివిజన్ లాల్‌సాబ్ గూడలో ఈనెల 19వ తేదీన జరుగనున్న సందల్ ఉత్సవాల పోస్టర్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, నిజాంపేట్ కార్పొరేటర్లు చిట్ల దివాకర్, బాలాజీ నాయక్, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ సాయియాదవ్, సుభాష్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, నాయకులు చంద్రగిరి సతీష్, బైండ్ల గోపాల్, సాయిబాబా, రమేష్, రసూల్, మౌలానా, ఫరీద్, మాము తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు శంభీపూర్ రాజును కలిసి స్థానికంగా ఉన్న సమస్యలను వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

చెరువులో దూకి వృద్ధుడు ఆత్మహత్య

దుండిగల్: మానసిక స్థితి సరిగ్గా లేని ఓ వృద్ధుడు చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల టీఎస్ఐఐసీ కాలనీకి చెందిన కృష్ణమూర్తి(80) ఇంటి వద్దనే ఉంటున్నాడు. కృష్ణమూర్తి మానసిక రుగ్మతలతో బాధపడుతున్నాడు. ఈనెల 7వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన కృష్ణమూర్తి తిరిగి రాలేదు. అదే రోజు అతని కుమారుడు తన తండ్రి కనిపించడం లేదని జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

◆ ఇదిలా ఉండగా షాపూర్‌నగర్ నుంచి సూరారం వైపు వెళ్లే ప్రధాన దారిలో ఉన్న సీసీకెమెరా పుటేజీలను పరిశీలించగా సూరారం కట్టమైసమ్మ దేవాలయం వైపు వెళ్లినట్లు తెలిసింది. చుట్టు పక్కల గాలిస్తుండగా అక్షయ బార్ వెనుక ఉన్న చెరువులో కృష్ణమూర్తి శవం లభ్యమైంది. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో వారం క్రితమే చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు జైరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వసతుల కల్పనకు పూర్వ విద్యార్థులు తోడ్పాటునందించాలి

కుత్బుల్లాపూర్: పూర్వ విద్యార్థులు పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు తోడ్పాటునందించాలని బీఆర్‌ఎస్‌కేవీ నేత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమకు విద్యాబోధన చేసిన పూర్వ ఉపాధ్యాయులను శాలువతో సత్కరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సంతోషంగా గడిపారు. స్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఉన్న మదన్‌గౌడ్‌ను సత్కరించి పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ఆయన చేస్తున్న కృషిని అభినందించారు. ముఖ్య అతిథిగా హాజరైన లయన్స్ క్లబ్ మాజీ ప్రెసిడెంట్ త్యాగిని పాఠశాల వాచ్‌మెన్, ఆయాలకు జీతాలు ఇచ్చేలా చూడాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులతో మదన్‌గౌడ్



మదన్‌గౌడ్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ఇళ్ల మధ్య స్క్రాప్ దుకాణాలతో ముప్పు



పంచశీల కాలనీలో కొనసాగుతున్న స్క్రాప్ దుకాణం

రంగారెడ్డినగర్: నివాస ప్రాంతాల మధ్య ఉన్న స్క్రాప్ దుకాణాలతో ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. ఇటీవల కాలంలో పలు స్క్రాప్ దుకాణాల్లో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదాలు ఇళ్ల మధ్యనే ఉండటం గమనార్హం. ఇటీవల జీడిమెట్ల పారిశ్రామికవాడను ఆనుకుని ఉన్న గంపల బస్తీ, ఐదు నెలల క్రితం పంచశీల కాలనీ రోడ్డు నం.5లోని స్క్రాప్ దుకాణాల్లో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నా అధికారుల్లో మాత్రం చలనం ఉండటం లేదు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పంచశీలకాలనీ రోడ్డు నం.1లోని రేషన్ దుకాణం పక్కనే స్క్రాప్ దుకాణం కొనసాగుతోంది. చుట్టూ ఇళ్ల మధ్యలో స్క్రాప్‌ను డంప్ చేస్తుండటంతో ప్రజలకు ప్రాణాలకు అపాయం పొంచి ఉంది. ఏదైనా జరగరాని ప్రమాదం చోటు చేసుకుంటే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇళ్ల మధ్య ఉన్న స్క్రాప్ దుకాణాలను జనవాసాలకు దూరంగా తరలించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

సంక్షేమ పథకాల అమలులో

తెలంగాణ దేశానికే ఆదర్శం

కుత్బుల్లాపూర్: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా మంగళవారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని చర్చిగాగిల్లాపూర్ రాజీవ్‌గాంధీనగర్, చైతన్యనగర్ కాలనీల్లో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లను ఏర్పాటు చేయాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించారు.

◆ అనంతరం వివేకానంద్ మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాను అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగు పరుస్తున్నామని అన్నారు. 58 జీవో దరఖాస్తుదారులకు పట్టాలు అందేలా కృషి చేస్తానన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే లక్షలాంది మంది నియోజకవర్గ వ్యాప్తంగా లబ్ధి పొందారని తెలిపారు.

◆ ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవీందర్‌యాదవ్, దుండిగల్ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, స్థానిక కౌన్సిలర్లు జోసిఫిన్ సుధాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, పాక్స్ వైస్‌చైర్మన్ నల్తూరి కృష్ణ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ యూత్ ప్రెసిడెంట్ సోమేష్ యాదవ్, సీనియర్ నాయకులు నాగరాజు, జైరాజ్ రెడ్డి, చెవిటి మురళి, జగన్ నాయక్, కుంటి మురళి, జహంగీర్, బాలయోగి, రాజు, కరీమ బేగం, భారతి, హసీనా, మత్యాస్‌రెడ్డి, తేజ, సారథి, సాయిబాబా, సతీష్, సంతోష్, ప్రవీణ్ నాయక్, మురళి తదితరులు పాల్గొన్నారు.



ప్రగతియాత్రలో భాగంగా చర్చి గాగిల్లాపూర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వివేకానంద్

కాంగ్రెస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యం

టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి

చింతల్: కాంగ్రెస్ పార్టీతోనే బంగారు తెలంగాణ సాధ్యమని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం చింతల్ డివిజన్ పరిధిలోని న్యూ ఎస్ఎల్‌బీనగర్-ఏ, బీ, షాపూర్‌నగర్ వాటర్ ట్యాంక్, వివేకానందకాలనీ, ఎస్సీకాలనీలలో పర్యటించిన ఆయన కాంగ్రెస్ పార్టీ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధి పనులు, అమలు చేసే సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంచి పెట్టారు.

◆ అనంతరం హన్మంతరెడ్డి మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలతో ప్రజలకు మోసం చేశాయని విమర్శించారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు వడ్డీలేని రుణాలు అందిస్తామన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్ కుమార్, జేమ్స్, పండరీ రావు, నారాయణ రెడ్డి, నాగరాజు, బాలు, హనుమంత్, చెల్మారెడ్డి, మాజీ వర్డ్ మెంబర్ గణేష్, అంజద్, దీపక్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



న్యూ ఎస్ఎల్‌బీనగర్‌లో ప్రజలకు కరపత్రాలను అందజేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

స్వచ్ఛ సర్వేక్షణ్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న హెల్త్ అండ్ ఎస్‌డబ్ల్యూఎం జాయింట్ కమిషనర్ ఉమాప్రకాష్

కుత్బుల్లాపూర్: స్వచ్ఛ సర్వేక్షణ్‌ను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని హెల్త్ అండ్ ఎస్‌డబ్ల్యూఎం జాయింట్ కమిషనర్ ఉమాప్రకాష్ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్-2023 సన్నాహాక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్లకు చెందిన శానిటరీ సిబ్బంది, ఎస్ఎఫ్ఏలు, రాంకీ సిబ్బంది పాల్గొనగా వారికి మూడు దఫాలుగా జరిగే స్వచ్ఛ సర్వేక్షణ్ ఇన్‌స్పెక్షన్ల వివరాలు వెల్లడించారు. బస్తీలు, కాలనీలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మురుగు, తాగునీటి పైప్‌లైన్ల లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు చెత్తను డంపింగ్‌యార్డులకు తరలించే విధంగా ఆయా విభాగాల అధికారుల సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల ఉప కమిషనర్లు మంగతాయారు, ప్రశాంతి, ఏఎంహెచ్ఓ, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దు

నిజాంపేట్: న్యాయబద్ధంగా కొనుగోలు చేసిన స్థలంపై కొందరు వ్యక్తులు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కేశం నరేశ్, ఖాదరయ్య అన్నారు. మంగళవారం బాచుపల్లిలోని రేణుకాఎల్లమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. తాము సీతారం, శతృఘ్నుల నుంచి సర్వే నం.485, 486లోని ప్లాట్లను కొనుగోలు చేశామన్నారు. వారి దగ్గర ఉన్న అన్ని లింక్ డాక్యుమెంట్లు పరిశీలించిన తరువాతనే ఈ స్థలాన్ని కొన్నామన్నారు.

◆ 476 గజాల స్థలంలో 137 గుండు నరేశ్ పేరుపై 137 గజాలను 2021 అక్టోబర్ 21న, ఖాదరయ్య పేరుపై 239 గజాలను 2021 అక్టోబర్ 21న రిజిస్ట్రేషన్ చేశామన్నారు. యూఎల్‌సీ హైదరాబాద్ వారి నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇచ్చారు. తాము కొన్న స్థలంలో ప్రహరీ నిర్మాణం చేసుకుంటున్నామని.. ఓర్వలేని కొందరు తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న నరేశ్, ఖాదరయ్య

◆ తమ ప్లాట్‌కు సంబంధం లేని అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్పొరేటర్ ఆగం పాండును అనవసరంగా బీజేపీ నాయకులు భాగస్వామ్యం చేయడం తగదన్నారు. ఈ విషయంలో తాము న్యాయ పోరాటం చేస్తామని పేర్కొన్నారు. రాజకీయాలకు దూరంగా ఉండే తమతో రాజకీయ నాయకులకు ప్రమేయం ఉందని చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు.

పొగతో ఉక్కిరిబిక్కిరి

పట్టించుకోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు

జీడిమెట్ల: పరిశ్రమల నుంచి వెలువడే వాయు కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతం ఫేజ్-2, 3లకు ఆనుకుని ఉన్న కాలనీల ప్రజలు పరిశ్రమల నుంచి వెలువడే పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా సుభాష్‌నగర్ డివిజన్‌లోని ప్రధాన కాలనీలైన ఎస్ఆర్ నాయక్‌నగర్, అపురూపాకాలనీ, వినాయకనగర్, అయోధ్యనగర్, రాంరెడ్డినగర్, సాయిబాబానగర్, మోడీ బిల్డర్స్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాయు కాలుష్యం విషయమై కాలనీల ప్రజలు పలుమార్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పగలు, రాత్రి తేడా లేకుండా వదులుతున్న పొగలు..

పరిశ్రమలలో బాయిలర్స్‌ను వేడి చేసేందుకు పరిశ్రమల్లో బొగ్గును విపరీతంగా వాడుతున్నారు. బొగ్గును మండిస్తుండటంతో పరిశ్రమల నుంచి నల్లటి పొగలు విపరీతంగా వెలువడుతున్నాయి. పొగలు అదే విధిగా రావడంతో కాలనీల్లో ఉన్న ప్రజలు గాలి పీల్చడానికి సైతం ఇబ్బంది పడుతున్నారు. ఉదయం వేళల్లో పొగ మరీ ఎక్కువగా వెలువడుతోంది. దీంతో ఎత్తైనా అపార్ట్‌మెంట్స్‌లోకి పొగలు వచ్చి చేరుతుండటంతో అపార్ట్‌మెంట్‌వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొగలు ఇలానే వెలువడితే రానున్న రోజుల్లో ప్రజలకు తీవ్రమైన శ్వాసకోస వ్యాధులు వచ్చే అవకాశం ఉందని డాక్టర్లు అంటున్నారు. ఇప్పటికైనా పీసీబీ అధికారులు పట్టించుకుని పరిశ్రమల నుంచి నల్లటి పొగలను వదిలే పరిశ్రమలపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఓ పరిశ్రమ నుంచి వెలువడుతున్న నల్లటి పొగ